"ఒక విధంగా ఆలోచిస్తే వాళ్ళదీ శారీరకమైన శ్రమే!"

"మరి కట్టెలు కొట్టుకొని బ్రదుకుతున్న వాడిది శారీరకమైన శ్రమ. బస్సు నడుపుతున్నవాడిదీ శారీరకమైన శ్రమ. ఇంతెందుకు?—ఈ బండి తోలుతున్న కన్నయ్యది శారీరకమైన శ్రమ. అయితే కన్నయ్య సమ్మె చేయలేదు. కట్టెలమ్ముకొనేవాడు సమ్మె చేయలేదు. బస్సు నడిపేవాళ్ళు మాత్రం సమ్మె చేయగలుగుతున్నారు."

మంజుల శ్రద్ధగా వింటూ ఆలోచిస్తున్నది.

బండి తోలుతున్న కన్నగాడికి భోగోతం చెవి కెక్కలేదు.

"మంజూ! ఈ దేశ సంపదను ఎవరో కొల్లగొట్టుకొని పోతున్నారని మధనపడి ఈ దేశ సంపదను ఈ దేశ వాసులకే పంచిపెట్టాలని మహాత్ములు స్వాతంత్ర్యాన్ని సాధించారు. మనల్ని మనల్నిగా బ్రతకమన్నారు. కానీ నోరున్న వాళ్ళదే రాజ్యంగా ఉంది. ఒకప్పుడు ఎవడో విదేశీయుడు మన నోళ్ళు గొడుతున్నాడని బాధపడ్డాం. మన సౌఖ్యాన్ని దోచేస్తున్నాడని విలపించాం. ఇప్పుడు మనలో మనమే—అంటే, నోరున్న వాళ్ళు నోరులేని వాళ్ళను దోచుక తింటున్నారు. ఈ సమ్మెల పరమార్థం ఇదేనేమో?—అనిపిస్తుంది."

ఇంతలో ఊరు వచ్చింది.

కన్నిగాడు ఇంటి ముందు బండి నిలిపాడు.

బండి ఇంటి ముందాగిన శబ్దం చెవిని పడడంతో ఆదరా బాదరా వీధి వాకిట్లోకి వచ్చిన లక్ష్మీకాంతమ్మ కొడుకును, కోడల్ని చూపి ఒక క్షణం అలానే నిలబడిపోయింది. అంతలోనే ఏదో మతికి తెచ్చుకొన్నట్లు గబగబ ఇంట్లోకి వెళ్ళింది. వెళ్ళినంత హడావిడిగా తిరిగి వచ్చింది, ఎర్ర నీళ్ళ తట్టతో! ఇంట్లో అడుగుపెట్టబోతున్న ఇద్దర్నీ అక్కడికక్కడే ఆపి ఎర్రనీళ్ళు దిగదీసి పోసింది.

వాకిట్లో నిలబడిన మంజుల, నిరంజనం ఒకరి వైపు చూచుకొన్నారు దొరగా! నవ్వుకొన్నారు దొరగా! అటుపై ఇంట్లోకి అడుగుపెట్టారు. లక్ష్మీ

